# అదే నిజం

## శ్రీవిరించి

వాతావరణంయేం బాగాలేదు. నిన్నటి వరకూ ఒకటే వాన. ఈవేళ ఉదయమే కాస్త తెరిపి ఇచ్చింది. అయినా ఇంకా ఎండరావడం లేదు. మధ్యాహ్నానికి మళ్ళీ వానధారలు కురుస్తాయని ఆకాశంలో మేఘాలు సూచిస్తున్నాయి. రామనాధానికి మందేయడానికీ తోచడం లేదు.

వసుంధర ఎనిమిది గంటలకల్లా బయటకు వెళ్ళిపోయింది. ఫ్యాన్సీ వస్తువుల దుకాణం నడుపుతుంది ఆమె. కొనుగోలుదార్లు ఈఉదయం బయటకు రావటానికి సాహసిస్తారు గనుక ఆమె కాస్త ముందుగానే దుకాణం తెరవాలని తీర్మానించుకుంది. మామూలుగా అయితే పదిగంటలకుగాని బయలు దేరదు. బ్రేక్‌ఫాస్ట్ తయారు చేసింది. రామనాథం కావాలనుకున్నప్పుడు తినవచ్చు.

వానలవల్ల టి.వి. కేబుల్స్ చెడిపోయాయి. ఎక్కడో మరమ్మత్తులు జరుగుతున్నాయి గనుక యే సాయంత్రానికో దీపాలు వెలిగితే అదే గొప్ప. రామనాథం వార్తలు, బొమ్మలు చూడటానికి వీలులేదు గనుక కాస్త చికాకు పడ్డాడు. ఏమయినా రాసుకుందాం అనుకున్నా చేయి ముందుకు సాగడంలేదు. మనసంతా మసక మసకగా మబ్బులు కమ్మినట్లుగానే వుంది. నిన్న, మొన్నరాసిన ఉత్తరాలు, తయారు చేసిన పుస్తకాల ప్యాకెట్లు పోస్ట్ చేయాలి. కాస్త బయటకు వెళ్ళి ఓ గంటసేపు తిరిగివస్తే బాగుంటుంది.

పదిగంటలు అవుతూ వుండగా, కారు బయటకు తీసి బయలుదేరాడు. దాని ధర్మమా అని అది ఏమీ మొండికెత్తకుండానే నడక సాగించింది. అపార్ట్‌మెంట్ తాళం వేసుకుని తాళంచెవులు భద్రంగా జేబులో పడేసి అవసరం లేకపోయినా రెండు మూడుసార్లు సరిచూసుకున్నాడు.

పోస్ట్ ఆఫీస్ ఇక్కడికి పదినిమిషాల డ్రైవ్. మేడమెట్లు యెక్కి వెళ్ళాలి. తనకు బాగా పరిచయం వున్న కౌంటర్ దగ్గరకు వెళ్ళి అన్నీ తూకం వేయించాడు. కరెంట్ లేదు గనుక ఫ్రాంక్లింగ్ మిషన్ పనిచేయడంలేదన్నాడు పోస్టల్ ఆసామీ. ఇంకా జనరేటర్ 'ఆన్' చేసే మనిషి రాలేదు. చాలా దూరం నుంచి రావాలి. అసలు వస్తాడో లేడో తెలియదు. కావలసిన తపాలా బిళ్ళలు అందించాడు ఆసామీ. వాటిని జాగ్రత్తగా తగిన స్థలంలోనే అతికించి అన్నిటినీ మళ్ళీ కౌంటర్లో అందించేశాడు.

అక్కడికి ఆపని అయిపోయింది. థ్యాంక్స్ చెప్పి మెట్లు దిగి కారు దగ్గరకు వచ్చాడు. బజారుదాకా వెళ్ళి చల్లగాలి పీల్చి ఇంటికి వెళ్ళిపోదాం అనుకున్నాడు. రోడ్డు వార ఇద్దరు స్త్రీలు కనబడ్డారు. ఆప్యాయంగా మాట్లాడుకుంటున్నారు. ఎంతో కాలం అయినట్లుంది కలుసుకుని. వాళ్ళను దాటి వెళ్ళిన తరువాత, బ్యాంక్ ఎ.టి.ఎమ్ కనిపించింది. కొద్దిగా డబ్బు తీసుకుని దగ్గర పెట్టుకుంటే బాగుంటుందనుకున్నాడు. లోపలకు వెడుతూవుండ గానే- బ్యాంక్ మేనేజర్ కనిపించాడు. అతని ముఖం చాలా ఆదుర్దాగా వుంది. బ్యాంక్‌లో దొంగలు చేరి దోచుకుపోలేదు గదా, అనిపించింది రామనాధానికి.

“మీకు అసౌకర్యం కలిగిస్తున్నందుకు క్షమించండి. ఎ.టి.ఎమ్ పనిచేయడంలేదు. దీన్ని ఎలాగయినా సరి చేయించాలని గంటనించీ మనుషుల కోసం చూస్తున్నాను” అన్నాడు మేనేజర్ రామనాథానికి గుడ్ మార్నింగ్ చెప్పిన తరువాత.

“అవున్లెండి. వాతావరణం ఇలా వుంది గదా!” అని ఊరడించాడు రామనాథం. అయినా ఎ.టి.ఎమ్‌లు 24-7 పని చేయాలని గదా సంకల్పం!

“శ్రమ అనుకోకుండా బ్యాంక్‌కు రండి. డబ్బు ఇప్పిస్తాను”

రామనాథం యేమీ జవాబు చెప్పకపోవడంతో మళ్ళీ అతనే, ‘చెక్ బుక్ తీసుకురాలేదని సంశయించకండి. బ్లాంక్ చెక్ ఇస్తాను. మీరు నాకు బాగా తెలుసు”

అన్నాడు.

"అంత అవసరం లేదులెండి. తరువాత తీసుకుంటాను" అని క్షమాపణ పూర్వకంగా చెప్పాడు రామనాథం.

బ్యాంకులు ప్రజలకోసం వున్నాయి. అవసరం లేని వాళ్ళకందరికీ అప్పులు ఇస్తాయి. వాటిని తీర్చకపోతే 'జులుం' ఉపయోగించడం, అలా చేయడం నేరం అని కోర్టులు చెప్పడం, అయినా ఇలాంటి దౌర్జన్యాలు జరుగుతూనే వున్నట్లు పేపర్లలో బాక్స్ కట్టి వార్తలు రావడం గుర్తు వచ్చింది రామనాథానికి. ఎవరి బాధలు వాళ్ళవి. బాధలు పెంచుకుందామనే తప్ప, దూరంగా వుందామని ప్రయత్నించరు.

"పోనీ, ఫరవాలేదు. ఊరికే రండి నాతో. కాస్త కాఫీ తాగుదాం" అన్నాడు బ్యాంక్ మేనేజర్.

నిరాకరించడం మర్యాద కాదనిపించింది రామనాథానికి. కాఫీ, తనకంటే, మేనేజర్‌కే ఎక్కువ అవసరం అన్నట్లుగా వుంది అతని వాలకం చూస్తుంటే.

ఛాంబర్‌లో కూర్చున్న తరువాత అడిగాడు మేనేజర్, "ఇప్పుడు ఏం రాస్తున్నారు? మొన్న మీ సమీక్ష చూశాను. తక్కువ తెలివితేటలున్న రచయితలను చెరిగిపారేశారు. మీలాగ మొహమాటం లేనివాళ్ళంటే నాకెంతో ఇష్టం" అన్నాడు అటెండర్‌కు కాఫీ తెమ్మని పురమాయించిన తరువాత.

రామనాథానికి అతను దేన్ని గురించి మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు. అయినా ఆ విషయం బయటకు చెప్పడం మర్యాద కాదుకనుక మందంగా నవ్వి వూరుకున్నాడు. లోపాలు ఎత్తి చూపడం ఎవరూ హర్షించరు. అయినా అప్పుడప్పుడూ ఆ పని చేయవలసే వస్తూంటుంది, సాంఘిక బాధ్యత గుర్తుకు వచ్చినప్పుడల్లా.

"మీ 'కాలం'లో మా బ్యాంక్ బాధలు కూడా కస్తా చిలకరించండి. ఎన్ని ఇబ్బందులున్నా ప్రజలతో సహజీవనం చేయడమే మా పూనిక" అన్నాడు మేనేజర్, కాఫీ తాగుతున్నప్పుడు.

"అలాగే... అలాగే..." అని తల ఊపి, కాఫీకి థ్యాంక్స్ చెప్పి లేచాడు రామనాథం. అతన్ని గుమ్మందాకా పంపించాడు, మేనేజర్ మర్యాదపూర్వకంగా.

బయటకు వచ్చిన తర్వాత ఓ జీడిపప్పు ప్యాకెట్ కొనుక్కున్నాడు, వేయించిన పప్పు-కాస్తా ఉప్పు, కారం జోడించింది-తింటూ కారునడపడం తేలిక అని అతనికి నిశ్చితంగా తెలుసు. 'రశీదు ఇవ్వలేదు. మిషన్...' అంది సేల్స్ గర్ల్. 'నాకు తెలుసు. ఫరవాలేదు లెండి' అని బయటపడ్డాడు, ఎం.ఆర్.పి.కంటే ఒక రూపాయి తక్కువే తీసుకుంది అని గమనించి.

పక్క బ్లాక్‌లో ఓ అపార్ట్‌మెంటులో వుంటున్న అనూరాధ కనిపించింది. "ఇంటికేనా వెడుతున్నారు? కాస్త నన్ను డ్రాప్ చెయ్యరూ?" అంది అభ్యర్థనగా.

## కనబడుటలేదు

ఇంట్లో
ఇల్లు కనిపించడంలేదు
మామూలే
రోజూ పొద్దున్నే లేస్తున్నాను
కళ్ళాపిచల్లి
రొటీన్ ముగ్గు వేస్తూనే వున్నాను
సమయానికి
అందరికీ ఇష్టమైన
వంటకాలు చేస్తూనే వున్నాను
టీవీ ఛానళ్ళ కండెల్లో చిక్కుకున్న
ఏకాగ్రతను
మ్యూట్ సాయంతో వెనక్కిలాక్కుంటున్నాను
ఎందుకోమరి!
రోజూ కనిపించే బల్లి ఒక్కసారి
నా కళ్ళల్లోకి చూసి వెళ్ళిపోయింది
అందరికీ చిరునవ్వులు
అతికించే కార్యక్రమం తప్ప
నాలోని కాంతిని
ఆరేసుకున్నది ఎప్పుడూ లేదు
అంతా నేనే అయినప్పుడు
గూడులాంటి ఇల్లుకోసం
ఎక్కడని వెతకను?
అవును
హాస్యానికి అనడంలేదు
ఇంట్లో
ఇల్లు కనిపించడంలేదు
దేహంలో ఆత్మలాగ

ఎస్.అరుణ

వాళ్ళతో ఎక్కువ పరిచయంలేదు. అయినా తెలుసు. వాళ్ళ అబ్బాయి పుట్టినరోజులకు రెండుసార్లు వెళ్ళాడు వసుంధరతో కలిసి. మంచి యువజంట. అతనేదో వ్యాపర సంస్థలో పనిచేస్తాడు. పక్కడోరు తెరిచి ఆమెను లోపలకు ఆహ్వానించాడు. ''పిల్లలను బడికి పంపి వస్తున్నాను'' అంది ఆమె.

''స్కూలుకు సెలవు ఇవ్వలేదా?''

''నిన్న మొన్న ఇచ్చారు. ఈరోజు తెరిపిగానే వుందిగా. మళ్ళీ రెండుగంటలకు వెళ్ళి వాళ్ళను తీసుకురావాలి''

నవ్వి ఊరుకున్నారు.

''నాకూ ఉద్యోగం చేయాలనే వుంది. అయితే పిల్లలతో కుదరదు. ఆయన ఎక్కువగా టూర్లో వుంటారు'' అంది అనూరాధ, ఏదో మాట్లాడాలని మౌనంగా కూర్చుంటే బాగుండదనిపించి.

''వసుంధర కూడా షాప్‌కు వెళ్ళింది. ఇవేళ సేల్స్ ఎక్కువగా వుంటాయని ఆమె అంచనా!''

## మనవి నాక్కాదు

నిదానమే ప్రధానం
నన్ను ముద్దుపెట్టుకోకు
ముందు వాహనాన్ని ఢీ!
ఇద్దరు దుర్మరణం!!

## నాన్నపలికురుతే కావ్యం

శోకంలో శ్లోకం
శ్లోకాలతో మహాకావ్యం
మానవాళికి సందేశం
నిక్షిప్తం, నిగూఢం

- పరుచూరి శ్రీనివాసరావు

## నాకోసం

నాకో మంచి మాటివ్వు
అక్షరలక్షలతో
అమృతాన్ని కురిపిస్తాను
నాకో ఓదార్పునివ్వు
గుండెని గుడిని చేస్తాను
అనంతంగా ఆరాధిస్తాను
నాకో స్నేహాన్నివ్వు
గాయాల దారంతా
మందహాసాన్ని పరుస్తాను
నాకో చిటికెడు ప్రేమనివ్వు
నీకోసం నిట్టూర్పు నౌతాను
ప్రపంచాన్నెదిరిస్తాను
ప్రాణాలైనా ఇచ్చేస్తాను
నాక్కొంచెం విషమివ్వు
నీకోసమే నిష్క్రమిస్తాను
సమాధిలేని జ్ఞాపకాన్నౌతాను

డా॥ సి.భవానీదేవి

''అవును. వసుంధర గారు మంచి కాల్కులేటివ్ మనిషి. అందుకే ఆమె అంటే నాకు ఇష్టం...''

వసుంధరను గురించి తనకంటే ఆమెకే ఎక్కువ తెలుసుననిపించింది రామనాథానికి. ఆమె అంటే ఇష్టం-అనేది కొత్త విషయం అని కూడా తోచింది. కష్టపడుతున్న వాళ్ళంటే ఎవరికయినా ఇష్టమే.

''ఈ వానలో క్రికెట్ ఎలా ఆడుతారో!''

''అందుకేగా రెండు రోజులూ ఆట ఆగిపోయిందీ! జట్లకు నష్టంరాకుండా ఇద్దరికీ చెరో రెండు పాయింట్లు ఇచ్చారుగా!''

''అయినా-ఇంట్లో కూచుని టీ.వీ. చూస్తున్న వాళ్ళకు మాత్రం ఆట ఆగిపోతే చాలా చికాకు అనిపిస్తుంది. యమ బోరు'' అంది అనూరాధ.

ఫ్యాను కింద కూర్చుని పని చేసేవాళ్ళు కొందరు. గనుల్లో తవ్వకాలు చేస్తూ చెమటలు కార్చేవాళ్ళు మరికొందరు! ఎవరి పని వాళ్ళు చేయకపోతే లోకవ్యవహారం ఎలా నడుస్తుంది! చక్రం తిప్పేవాళ్ళు ఎప్పుడూ నీడపట్టునే వుంటారు.

అనురాధ అపార్ట్‌మెంట్ వచ్చింది. కారు ఆపాడు.

''మీకేమీ తొందర పనులు లేకపోతే మా ఇంటికి రండి.ఓ అరగంట కూర్చుని వెడుదురు గాని...'' అంది పెదవుల నిండా చిరునవ్వు పులుముకుని.

''నాకెప్పుడూ తొందర పనులులేవు. అన్నీ నిదానంగానే చేస్తాను'' అన్నాడు రామనాథం కారు పార్క్ చేస్తూ.

# తప్పిపోతున్న సంస్కృతి

నాగరికత పోగొట్టుకుంటున్న సంస్కృతి
నగరమంతా వెతికినా కనిపించట్లేదు
వలసలొచ్చినప్పుడు తెచ్చుకున్న
సంబరాలూ, సాంప్రదాయాలు
మళ్ళీ ఊళ్ళల్లోకెళ్ళిపోయి
మనల్ని చూసి వెక్కిరిస్తున్నాయీ
ఏవగింపుతో ఎబ్బెట్టుగా చూస్తున్నాయి
చదువులు చెప్పిస్తున్నారుగానీ
సంస్కృతి నేర్పించట్లేదంటూ
సంపాదనే తెలుస్తోందిగానీ
సంస్కారం తెలియట్లేదంటూ
కాంప్రమైజ్ లేని జీవితాలకు
సాంప్రదాయమక్కర్లేదనిపిస్తోంది.
పిజ్జా, బర్గర్ల బిజీలైఫ్‌లో
పాత చింతకాయపచ్చడి
పనికిరాకుండా పోతోంది
అమ్మానాన్నలే
వృద్ధాశ్రమంలో వుంటున్నప్పుడూ
తాతా, నానమ్మల
గోత్రం, వంశం ఎందుగ్గుర్తుంటాయి.
పడమటిగాలికి పరవసిస్తున్నప్పుడు
ఊహలకు రెక్కలొచ్చినట్టయి
ఊపిరి సలపకపోతే,
వేప, తుమ్మ వేడిగానే అనిపిస్తాయా
పగటికలల్లో డాలర్లు కనిపిస్తాయి.
'అదుర్స్' డ్రస్సుల వ్యానిటీ బ్యాగుల్లోంచీ
అదిరిపడే ప్యాంట్ ఆరుజేబుల్లోంచి,
'ఐటి' జీతాల్లోంచీ
హబ్స్ కల్చర్ లోంచి
ఊడల మర్రిలాంటి ఉత్కృష్ట సంస్కృతి
జాడలేకుండా పోతున్నప్పుడూ
తప్పు యువతి గాదు
తల్లిదండ్రులదే అని చెప్పొచ్చు.
చరిత్రను మరిచిపోతున్న
పండగలూ, పబ్బాలను పక్కనబెడితే
ఉమ్మడి కుటుంబాల్లోని బంధుత్వాలే
ఉత్తుత్తి ప్రేమతో పురుడుపోసుకుంటున్నాయి.
మా పిల్లలకు తెలుగు రాదంటూ...
సిగ్గులేకుండా చెప్పే మమ్మీడాడీలే
చిన్నారులను నిర్వీర్యం చేస్తున్నప్పుడూ
తప్పు ఎక్కడుందని గింజుకోడం దేనికీ
తలబాదుకోడం దేనికి!
విచ్చలవిడి స్నేహాలకు
డేటింగ్‌లు తోడవుతున్నందుకే
తప్పిపోతున్న సంస్కృతి గురించి
తలాకాస్త ఆలోచించండి
పరిష్కారం దొరికిపోతుందీ
ఫలితం కనిపిస్తుంది.

కన్నోజు లక్ష్మీకాంతం

అనూరాధ "మా గదులన్నీ చూడండి..." అంది.

"అది వరకు వచ్చాం కదూ?" అని సంశయం వెలిబుచ్చారు.

"నిజమే. అప్పుడు హాలులో మాత్రం కూర్చుని వెళ్ళారు. అంతే కదూ?"

పిల్లల గది చూపించింది. బట్టలన్నీ విచ్చలవిడిగా పడి వున్నాయి. "ఇవన్నీ నేను తీరుబడిగా మధ్యాహ్నం సర్దుకోవాలి. పిల్లలకు డిసిప్లిన్ నేర్పడం నాకు చేతకావడం లేదు" అంది అనూరాధ.

"డిసిప్లిన్ నేర్పగూడదు. వాళ్ళే అనుభవమీద నేర్చుకుంటారు" అని సముదాయించాడు రామనాథం.

తరువాత తమ బెడ్‌రూమ్ చూపించింది. ఆధునికత అతనికి అలవాటే. మళ్ళీ హాలులోకి వచ్చారు. తివాచీ మధ్యగా పరిచి వుంది. ఒకపక్క టీ.వీ, మరో పక్క టేబుల్. దాని మీదనే కంప్యూటర్. నాలుగు మూలలా పూలకుండీలు వాటిలో పచ్చటి, ఎర్రటి రంగుల

ఆకులు-పువ్వులు. ఇల్లు చక్కగా సర్దుకోవడం, అమరికగా వుంచుకోవడం మీద ఇప్పుడు ఎన్నో పత్రికలు వస్తున్నాయి. స్కూళ్ళలో కాలేజీలలో ఈ విషయాలు చెప్పకపోయినా- అందరూ అందమయిన చిత్రాలు, ఫోటోలు చూచి ఆనందంగా ఇలాంటి అలవాట్లు చేసుకుంటున్నారు. వాతావరణం ప్రశాంతంగా వుంచుకోవడం అలవోకగా సాధ్యం అవుతోంది.

## హైకూలు

విలుకానికే కాదు
పాపాయికీ ముఖ్యమే
బొటనవ్రేలు

మంచం మీద
పాపాయి
మూడంకె

నీ అందం చూసి
జాబిలి మొహాన
గంటు

మెరుపు వెంట
ఉరుము లేదు కాని
నాపై ప్రేమ చినుకు

## మినీలు

అపరంజి బొమ్మ
పెళ్లయితే అమ్మ
భవితలో బామ్మ

ప్రేమ కోసం బీచి
పెళ్లి కోసం తాళి
చావు కోసం సంద్రం

మందిని కాపాడే
మందులు నకిలీ
వందిత స్వామీజీల
మనసులు మకిలీ

డాక్టరు రాత
మందుల బిల్లు మోత

బద్ధి నాగేశ్వరరావు

వుళ్ళీ కాఫీ తాగడం తప్పనిసరి అయింది రామనాథానికి.

అనూరాధ తన కుటుంబ వివరాలు చెబుతోంది. తల్లి తండ్రీ ఎంతో ఆప్యాయంగా పెంచారుట ఆమెను. ఇంకా ఇద్దరు తమ్ముళ్ళు. కాలేజీలలో వున్నారు. తరువాత అమెరికా వెళ్ళి చదువులు సాగించాలని ప్రయత్నం. ''అతను, మూడురోజులయి టూర్ వెళ్ళాడట. మరో రెండురోజులకు గాని రాడు.''

''పక్క పక్క ఇళ్ళని పేరేగాని ఎవరూ పలకరించేవాళ్ళే వుండరు. లిఫ్ట్ దగ్గర కలిసినప్పుడు అత్యవసరంగా హలోలు చెప్పడమే గాని''

''ఎవరి పనులు వాళ్ళకుంటాయి. పక్కవాళ్ళను పట్టించుకోవడం కుదరదుగదా, ఈ ఆధునిక జీవితంలో'' అన్నాడు రామనాథం 'ఆధునిత' ను కాస్త నొక్కి.

''బాగా చెప్పారు''

''తీరిక సమయంలో ఏం చేస్తుంటారు?''

''తీరిక ఎక్కడిది అసలు. చదరంగం ఆడుకుంటాను- ఓ అరగంట విరామం దొరికితే...''

''మరి పార్ట్‌నర్?''

''కంప్యూటర్ మీదనే. గేమ్స్ చానెల్స్‌తోనే కాలక్షేపం ఎక్కువ''

''పోనీలెండి. సినిమా ఛానెల్స్ కంటే అవే నయం కదూ?'' ఆమె స్పందన ఎలా వుంటుందో గమనిస్తున్నాడు రామనాథం.

''సీరియల్స్ అస్సలు చూడనండీ! ఎప్పుడన్నా పాత సినిమాలు వస్తే చూస్తాను,రాత్రి నిద్రపట్టనప్పుడు''

''సీరియల్స్ అన్నీ చెడ్డవి కాదులెండి. వాటిద్వారా నేర్చుకోవలసినవీ ఎన్నో వుంటాయి...'' అన్నాడు రామనాథం కవ్వింపుగా.

''లేవనికాదు. కుటుంబ సమస్యలను మరీ ఎక్కువ చేసి చూపిస్తారు. గోటితోపోయే దానికి గొడ్డళ్ళు పట్టుకొస్తారు'' అంది అనూరాధ నవ్వుతూనే.

రామనాథం ఇంక ఆ ప్రస్తావన ఆపేశాడు.

అనూరాధ అతనివైపు కవ్వింపుగా చూస్తోంది.

''ఇక ఇంటికి వెళ్ళి విశ్రాంతి తీసుకుంటాను'' అని లేవబోయాడు.

''విశ్రాంతి ఇక్కడే తీసుకోవచ్చుగా''

''తీసుకోగూడదని కాదు...'' అంటూ ఇంటి దగ్గర

అయితే మరింత రికామీగా కూర్చోవచ్చునని మనసులో అనుకున్నాడు. బయటివాతావరణం ఇలా వున్నప్పుడు మనసు ఊరుకోదు. ఉరకలు వేస్తూ వుంటుంది. ఏదేదో చేయాలనిపిస్తుంది.

అకస్మాత్తుగా 'కరెంట్' వచ్చిన హడావుడి.

''ఇంట్లో దీపాలన్నీ వేసి వచ్చాను. వెళ్ళి వాటికి విశ్రాంతి ఇవ్వాలి. మీకూ యేవో పనులుంటాయిగా. తీరుబడిగా టీ.వీ చూస్తూ అవన్నీ చక్కబెట్టుకోండి. నేను వెళతాను-''

''అప్పుడప్పుడూ వస్తూ వుండండి. మీబోటి వాళ్ళతో కాస్సేపు గడిపితే నాకూ మనసుకు ఫ్రీగా వుంటుంది. జీవితానికి అర్థం వున్నట్లు కనిపిస్తుంది''

''అర్థమే కాదండోయ్. పరమార్థం కూడా వుంది...'' అన్నాడు రామనాథం, బయటకు వస్తూ.

''సాయంత్రం వీలయితే వసుంధరగారిని కూడా తీసుకురండి''

''అలాగే. తను వచ్చేటప్పటికి ఎంతట్టైమవుతుందో!''

''వీలయితేనే!... అయినా పగలంతా పనిచేసి అలసిపోయి వుంటారు గదా! కాస్సేపు ఇలా వస్తే, రిలాక్సింగ్‌గా వుంటుంది...''

- ఆ మాట నిజమే అనుకున్నాడు రామనాథం.

తిన్నగా ఇంటికి వెళ్ళాడు. దీపాలన్నీ ఆర్పాడు. మిగిలిపోయిన జీడిపప్పులు నములుతూ న్యూస్‌పేపర్లు తిరగేశాడు.

టెలిఫోన్ మోగింది.

వసుంధర. ''ఏం చేస్తున్నారు?'' అని అడుగుతోంది.

''ఏమీ చేయడంలేదు. ఇప్పుడే పేపర్లు చూడడం అయిపోయింది''

''నిన్న మొదలుపెట్టిన కథ పూర్తి చేయండి. ఎవరూ డిస్టర్బ్ చేయరుగా ఈ వాతావరణంలో. రెండు గంటల్లో అయిపోతుందన్నారు, గుర్తుందా?''

తన వ్యాపకాలమీద వసుంధరకువున్న శ్రద్ధ రామనాథాన్ని ఎప్పుడూ అలరిస్తూ వుంటుంది. నిజానికి ఆమె గుర్తు చేసి- పోరుతూ తన చేత ఎన్నో రచనలు చేయిస్తోంది. ఈ విషయంలో ఆమెకు కృతజ్ఞత చెప్పక తప్పదు. ప్రస్తావన వచ్చినప్పుడు ఇతరులతోకూడా ఆమె చేస్తున్న సాయం గురించి తప్పకుండా చెబుతూ వుంటాడు.

''పోటీ కోసం ఏమన్నా కథ రాస్తున్నారా?'' అని ఎవరైనా అడిగినప్పుడు ''నేను పోటీ పడకుండానే రాస్తాను సుమండీ!'' అంటాడు రామనాథం. అదో విశేషం అన్నట్లుగా. రాసినవి పేరుకుపోయి లేవు. అవసరం అయి

## అభినందన రసపద్ధతిక

**అ**నురాగాల పొదరిల్లు
అనుబంధాల హరివిల్లు
మమతా సమతలు పెనవేసుకున్న సుందర నిలయం
ఆత్మీయతను కలబోసుకునే రుక్మిణీ హృదయం
ఉత్తుంగ తరంగితమై
ఉద్వేగభరితమై
రాగాల సెలయేరులా సాగే వంశానుగతమైన ఆస్తి
నాలుగు గోడలపై వేసిన కప్పు కాదు ఇల్లంటే
నలుగురి హృదయాలు మమేకమైన వలపుల పొదరిల్లు; కంటే
వేణుమాధవుడి మధుమాస దరహాసపు గానంలో
పరవశమైన శ్రీదేవీ హృదయం నుండి కదిలిన వలపు కొలనిది
మనసు లోతుల నుండి రమణీయంగా సాగిన
అనుబంధ గీతమై, సురుచిర కావ్యమై
సుమధుర శ్రావ్యమై కమనీయమైనది
జగన్మోహనాకారమై అభిమాన ప్రాకారమై
అనూరాధా వల్లరీ బంధమై తియ్యని పాటలా
కనిపించే లోగిలి
సాంప్రదాయబద్ధమైన నవతా మానవతలు
పెనవేసుకొన్న బిగి కౌగిలి
ముక్కోటి దేవతల ఆశీరక్షతలు మీ ఇంట కురవాలి
విజయానికి, విద్వత్తుకీ ఉత్సాహానికీ సాకారమై సాగాలి.

*(ఓ జర్నలిస్టు మిత్రుడు గృహప్రవేశం సందర్భంగా...)*

**బి. రాంబాబు**

## నానీలు

ముదితకు
కోపం వచ్చిందా!
ఇక నుదుటి ఎర్రబొట్టే
మూడోనేత్రం!!

అమ్మ ప్రేమను రంగరించి
ఉగ్గుపోసింది!
మరి
ఇంత ద్వేషమెలా చేరింది?

ఆకు రాలింది
చెట్టేం పట్టించుకోదు!
రాలిపోయే ఆకుదే
అరణ్య రోదన!!

యవ్వనంలో పాడిన
ఎంకిపాట!
ఇంకా మదిలో ఉంది
టెంకాయలో నీళ్ళలా!!

రాముడు దేవుడంటే
ఒప్పుకుంటాడు!
అగ్నిపునీత సీత
అంటే ఒప్పుకోడే!!

కొడవలి సత్యనారాయణ

నప్పుడే రాయడం అతనికి అలవాటు. ఆ అవసరం ఇతరులమీద ఆధారపడి వుండదు. తన 'ఇన్నర్ అర్జ్' ఒక్కటే అతన్ని రాసేట్లు చేస్తుంది. ఇది ఉబికి రావటానికి తగిన వాతావరణం కల్పన తన చేతుల్లో లేదు. బయటి జీవితాన్ని చూస్తుంటే ఎన్నయినా కథలు రాయవచ్చుననిపిస్తుంది. ప్రత్యేకంగా కల్పించవలసిన అగత్యం లేదు. జీవితం కల్పనలకంటే విచిత్రమయిందనే నానుడి వుండవచ్చుగానీ; అసలు జీవితం అంతా కల్పనే కదూ!

''ఏమిటి ఆలోచిస్తున్నారు. జవాబు చెప్పరేం?'' అంది వసుంధర మళ్ళీ.

''అలాగే! నేనూ అదే అనుకుంటున్నాను...''

''అనుకోవడం చాలదుగదూ!''

''హెచ్చరించావుగా. అలాగే చేస్తాను... కథ పూర్తయ్యేసరికి రెండు గంటలు అవుతుంది. నీ దగ్గరకు వస్తాను. బయట లంచ్ తీసుకుందాం. సరేనా?''

''నేనూ అదే చెబుదాం అనుకుంటున్నాను. రెండున్నరకు రండి. లంచ్ చేసి వాతావరణం ఇలాగే వుంటే, నేనూ ఇంటికి వచ్చేస్తాను''

''అడగడం మరిచిపోయాను. దుకాణంలో బేరాలు జోరుగా వున్నాయా?''

''భేషుగ్గా వున్నాయి. ఓ వారం రోజులకు సరిపడా

## నానీలు

చెట్లు మాయమై
పుట్టుకొచ్చిన ప్లాట్లు
పుడమి గుండెల్లో
గునపపు పోట్లు

పట్టెడు మెతుకులు
గుప్పెడు ప్రేమకై
స్వంత ఇంట్లోనే
బిచ్చగాళ్ళు

మండుటెండలో
ముత్యమై మెరుస్తుంది
శ్రమ సౌందర్యపు
స్వేద బిందువు

రక్తంతో తడిసిన
సంచనాలకు
ప్రతిరూపాలు
వార్తా పత్రికలు

ఒంటినిండా
గాయాలైనా
వెదురు... వినిపించును
వేణుగానామృతం

ఎస్.ఎం.సుభాని

సేల్స్ చేసేశాను. నేను పెందలాడే రావడం మంచిదయింది''

''కంగ్రాట్స్! అయితే హోటల్ బిల్లు నీవే ఇస్తావన్నమాట''

''దుకాణం ఖర్చుల్లో రాసేస్తాలెండి. మీదీ నాదీ కూడా కాదు''

''చాలా 'కాల్కులేటివ్' అని అందుకే అంది అనూరాధ''

''అనూరాధ వచ్చిందా?''

''లేదు. బయట కనిపించింది. వాళ్ళింటికి తీసుకువెళ్ళి కాఫీ ఇచ్చి పంపింది''

''గుడ్! ఆమె చాలా 'ఇంటిలిజెంట్ గర్ల్' అడిగానని చెప్పండి. ఈమారు కలిసినప్పుడు''

''సాయంత్రం మన ఇద్దర్నీ మళ్ళీ రమ్మంది. అప్పటికి పిల్లలు కూడా ఫ్రీగా వుంటారుట!''

''అలాగే వెడదాం... ముందు మీరు కథ పూర్తి చేయండి''

''ఉండనా- అయితే...''

''గుడ్! రెండున్నరకు రావడం మర్చిపోకండి''

''మరిచిపోను. గడియారం మోగటానికి ముందే...''

''కథ మాత్రం పూర్తిచేసి రావాలి సుమా!'' అంది వసుంధర రిసీవర్ క్రేడిల్ చేస్తూ.

కథ పూర్తికాకపోతే 'లంచ్' ఇవ్వదు వసుంధర, అనుకుని నవ్వుకున్నాడు తనలో తనే.

రైటింగ్ ప్యాడ్‌లో కాగితాలు తిరగేశాడు.

కథంతా మళ్ళీ చదివాడు. దాదాపు అయిపోయినట్లే.

ఇంకో రెండు పేజీల్లో 'ఎపిఫనీ' ఇచ్చేస్తే ఇంతకన్నా అద్భుతమైన కథ వుండదు- అనిపించింది.

'ఎపిఫనీ' గురించి రెండు క్షణాలు ఆలోచించి, రాయడంలో మునిగిపోయాడు.

కథలో సుజాతను ఏంచేయడం?

ఎవరైనా బైరాగి వచ్చి తాయిత్తు ఇస్తాడా?

కోరుకున్న వాడే వచ్చి రాజీపడి ఊరడిస్తాడా?

స్వబుద్ధి ఉపయోగించి సుజాత తనంత తానే స్వేచ్ఛగా బయటపడగలుగుతుందా?

కలం సాగిపోతూ వుంది.

కథలో జీవితం అయిపోదు. దాంట్లో మెలికలు లేని మెరుపే కథ!

గడియారం రెండు గంటలు కొట్టేటప్పటికి రామనాథం కలం మూసేసి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. వసుంధర దగ్గరకు వెళ్ళడానికి ఈ అరగంటా చాలు. ■

## గ్లోబలోడు

కండలు పెంచినా
మంచే తప్ప చెడు చెయ్యలేదు భీముడు
పామును పట్టి ఆడించినా
మనిషికి హాని చెయ్యలేదు పాములోడు
చెడే తప్ప మంచి చెయ్యనోడు
అమెరికోడు-వాడే గ్లోబలోడు

## గాయాల చంద్రుడు

చంద్రుడ్ని
ఏవో అజ్ఞాత హస్తాలు
గాయపరిస్తే
స్రవిస్తున్న తెల్లరక్తం వెన్నెల
పక్షం రోజులపాటు
గాయాలకు
మందులు పూసుకుంటూ
స్పష్టత చేకూరేదాకా
ఆకాశంలో కనబడడు చంద్రుడు

మాధవి సనారా

## మనిషిని మనిషిగా ప్రేమించు

కులాలకోసం కులీనులుగా మారటం
కాసులకోసం రాకాసిగా మారటం
ఆస్తులకోసం అస్తికగా మారటం
అంతరిక్షాన్ని అధిగమించినా
గ్రహాలపై విగ్రహాలు మలచినా
అసాధ్యాన్ని సుసాధ్యం చేసినా
రాజకీయం కోసం రంగులు మార్చినా
మనిషి మనిషిగా (మంచి) మారేదెప్పుడు?
మనిషిని మనిషి ప్రేమించేదెపుడు!?

నెగోశ్రీ